క్లుప్తంగా

జగనన్న సురక్షతో ప్రజలకు లబ్ధి



సర్టిఫికెట్లను అందిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ రహంతులయ్య

ప్రొద్దుటూరు : జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మేలు జరిగిందని ఇన్‌చార్జి ఎంపీడీఓ రహంతులయ్య అన్నారు. మండలంలోని నంగనూరుపల్లె గ్రామ సచివాలయంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ మాట్లాడుతూ తగంలో ఏదైనా సర్టిఫికెట్ తీసుకునేందుకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా దరఖాస్తు చేసిన వెంటనే ప్రజలకు గ్రామాల్లోనే సర్టిఫికెట్లను మంజూరు చేస్తున్నారన్నారు. అనంతరం దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందించారు. సర్పంచ్ శావలి లక్ష్మీదేవి, ఎంపీటీసీ క్రిష్టిపాటి సంధ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు యాలం శంకరయ్య, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



మొక్కలు నాటుతున్న సురేష్ కుమార్, అధ్యాపకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది సురేష్ కుమార్, స్వాతంత్య్ర సమరయోధుడు బాల యల్లారెడ్డి మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో సైనికులు కాపలా కాస్తుండటంతోనే మనం ఇక్కడ ప్రశాంతంగా జీవిస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా సైనికుల సేవలను కొనియాడారు. అనంతరం వారు కళాశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రిటైర్డు సుబేదార్ మేజర్ నేట్ల బాలవీరారెడ్డి, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

కడప ఉక్కుపై కేంద్ర ప్రభుత్వానిది మోసం

ప్రొద్దుటూరు : కడప ఉక్కుపై కేంద్ర ప్రభుత్వం యువతను మరోసారి మోసం చేసిందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ అన్నారు. బుధవారం ప్రొద్దుటూరులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో కడప ఉక్కు పరిశ్రమ కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని స్పష్టంగా ఉన్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జిల్లా ప్రజలకు సంజీవని అయిన కడప ఉక్కు పరిశ్రమపై పార్లమెంట్‌లో కేంద్ర సహాయమంత్రి కడప ఉక్కు పరిశ్రమ సాధ్యం కాదని ప్రకటించడం దారుణమన్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఇక్కడ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు మూడు శిలాఫలకాలు ఏర్పాటు చేశాయన్నారు. కేంద్రాన్ని ఎదిరించకుండా రాజకీయ ఓటు బ్యాంకు కోసం వాడుకుంటున్నారు తప్ప చిత్తశుద్ధితో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడం లేదన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు యువత, విద్యార్థులు పోరుబాట పట్టాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



విద్యార్థి కమల్ తల్లికి ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

బి.కోడూరు : మండలంలోని విజయనగరకాలనీకి చెందిన రంపతోటి ఓబులేసు, రమణమ్మల ఏకైక కుమారుడు కమల్ గ్రామ సమీపంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతూ ఈ నెల 22వ తేదీన రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురై మృతిచెందాడు. బుధవారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు పెంచలయ్య, ఉపాధ్యాయులు కమల్ చిత్రపటానికి నివాళులర్పించారు. పాఠశాలలో పనిచేస్తున్న భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు కె.విజయబాబు తన మిత్రుల సహకారంతో విద్యార్థి కమల్ తల్లికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఈ ఆర్థిక సహాయానికి సహకరించిన లాజరస్, మిత్రులకు పాఠశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఎంఈఓ ఎం.సునీల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

దువ్వూరు : మండల పరిధిలోని వెల్లాల కొట్టాల గ్రామ సమీపంలోని పొలాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వారి నుంచి రూ.23,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే గెలుపు

బూత్‌కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : 2024 ఎన్నికల సీజన్ ఆరంభమైందని, ఈ సమయాన్ని కీలకంగా భావించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. రాచమల్లు రాజన్న భోజనం హాల్లో బుధవారం పోలింగ్ బూత్ కమిటీల ఏర్పాటుపై నియోజకవర్గ పరిధిలోని కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో 267 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, ప్రతి పోలింగ్ స్టేషన్‌ను సమానంగా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. మరో 9 నెలల్లో ఎన్నికలు జరగనున్న పరిస్థితుల్లో పార్టీ శ్రేణులంతా ఉత్సాహంగా పనిచేయాలని కోరారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో కచ్చితంగా ఉంటేనే మనం ప్రజలతో ఓటు వేయించుకోగలమన్నారు.సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా మళ్లీ మనం అధికారంలోకి వస్తామన్నారు. గ్రామాల్లోని ప్రతి కార్యకర్త కీలకంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో పద్మశాలీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, ఎంపీపీ శేఖర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్ ఖాజా, రాజుపాళెం వైస్‌ఎంపీపీ నారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, పట్టణాధ్యక్షుడు కామిశెట్టిబాబు, కోనేటి సునంద, రాష్ట్ర అదనపు కార్యదర్శి లక్కిరెడ్డి పవన్, టౌన్ బ్యాంకు చైర్మన్ కుమార్‌రెడ్డి, హౌస్‌బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, మార్తల ఓబుళరెడ్డి, రాజారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరిగా పాటించాలి



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారి రామకృష్ణ

దువ్వూరు : కేపీ ఉల్లి సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయాలని మైదుకూరు ఉద్యానశాఖ అధికారి రామకృష్ణ అన్నారు. మండల పరిధిలోని చిన్నసింగనపల్లె గ్రామం రైతు భరోసా కేంద్రంలో బుధవారం కేపీ ఉల్లి పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట సాగుకు ముందు భూసార పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. భాస్వరాన్ని పైపాటిగా చల్లడం వల్ల ఉపయోగం లేదని, దుక్కిలోనే ఉపయోగించాలని చెప్పారు. ఎన్‌హెచ్‌ఆర్‌డీఎఫ్ వారు అందించే కేపీ ఉల్లి విత్తనాలు ఎకరాకు 7–8 కిలోలు సరిపోతాయన్నారు. కొందరు రైతులు ఎకరానికి 20 కేజీల విత్తనాలు చల్లడం వల్ల అధిక శాతం మొలకలు వచ్చి గాలి, వెలుతురు సరిగా సోకకపోవడం వల్ల తెగుళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. యూరియా లేదా అమోనియం సల్ఫేట్ రెండు దఫాలుగా పైపాటుగా చల్లాలని సూచించారు. ఉల్లిపంటలో నీరు అధికంగా ఉంటే ఫంగస్ తెగులు వచ్చే అవకాశం ఉందని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌డీఎఫ్ టెక్నికల్ ఆఫీసర్ సర్వానన్, మండల వ్యవసాయ సలహాకమిటీ చైర్మన్ వీరనారాయణరెడ్డి, ఆర్‌బీకే అగ్రికల్చర్ అసిస్టెంట్ గంగఈశ్వరి, హారిక, సమీర, పాల్గొన్నారు.

నేడు పెద్దగురువళూరులో గడప గడపకు మన ప్రభుత్వం

చాపాడు : మండల పరిధిలోని పెద్దగురువళూరు గ్రామ పంచాయతీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ రాధాకృష్ణవేణి తెలిపారు. పంచాయతీలోని గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఇంటింటా తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తారని, అలాగే ప్రజల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఉపాధి పనులపై సామాజిక తనిఖీ సభ

చాపాడు : స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద గురువారం ఉపాధి హామీ పథకంలో భాగంగా జరిగిన పనులపై చేపట్టిన సామాజిక తనిఖీపై బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఏపీఓ పద్మారాణి తెలిపారు. 2022 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకూ మండల వ్యాప్తంగా జరిగిన ఉపాధి పనులపై అధికారులు సామాజిక తనిఖీ చేపట్టారన్నారు. ఈ తనిఖీపై బహిరంగ సభ నిర్వహిస్తామని, పనుల్లో వ్యత్యాసాలు ఉంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఏపీఓ తెలిపారు.

బి.మఠంలో బస్ షెల్టర్ ఏర్పాటుకు సహకరించాలి

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠం మల్లేపల్లె రోడ్డులో బస్‌షెల్టర్ ఏర్పాటుకు అందరూ సహకరించాలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి బస్‌షెల్టర్‌కోసం రూ .14 లక్షల నిధులు ప్రభుత్వం నుంచి విడుదల చేయించడంతో భూమి పూజ చేశామన్నారు. రోడ్డు విస్తరణలో బస్‌షెల్టర్‌ను తొలగించడంతో సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా వెంటనే నిధులు కేటాయించారన్నారు. మల్లేపల్లెరోడ్డు వంక సమీపంలో ఆర్‌అండ్‌బీ స్థలంలో మినీ బస్‌షెల్టర్ ఏర్పాటుకు అధికారులు మార్కింగ్ ఇచ్చినట్లు చెప్పారు. స్థానికులు కొంతమంది మఠం అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. రోడ్డు వెడల్పులో నష్టపోయిన చిరు వ్యాపారులకు త్వరలో న్యాయం చేస్తామన్నారు. బస్‌షెల్టర్ ఏర్పాటుచేసే స్థలం వద్ద కొంతమంది అనుమతులు లేకుండా బంకులు పెట్టడం తగదన్నారు. దయచేసి బస్‌షెల్టర్ ఏర్పాటుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు సుబ్బిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మేకల రత్నకుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

చక్రాయపేట డీటీగా రామకృష్ణారెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల పౌరసరఫరాల శాఖ గోడౌన్‌లో డీటీగా పనిచేస్తూ సస్పెండ్ అయిన పల్లా రామకృష్ణారెడ్డికి చక్రాయపేట మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్ విజయరామరాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోడౌన్‌లో జరిగిన అవకతవకలపై షోకాజ్ నోటీసులు జారీ చేసిన అనంతరం గత నెలలో డీటీ రామకృష్ణారెడ్డిని కలెక్టర్ సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఆయనను చక్రాయపేట మండల రెవెన్యూ కార్యాలయంలో డీటీగా నియమిస్తూ ఉత్వర్తులు జారీ చేశారు.

టీడీపీ నాయకుల ఆరోపణల్లో వాస్తవం లేదు



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ

బద్వేలు అర్బన్ : శివాలయం రోడ్డు పనులను తాను అడ్డుకుంటున్నట్లు టీడీపీ నాయకులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంతలమయమైన శివాలయం రోడ్డు స్థానంలో తారురోడ్డును అధికారులు ప్రతిపాదిస్తే సీసీ రోడ్డు అయితేనే మన్నిక వస్తుందని మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, తాను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధతో మాట్లాడి సుమారు రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయించామన్నారు. శివాలయం రోడ్డు గుంతలమయం కావడంతో గతంలో రెండు సార్లు మట్టి తోలించామని, దీని వల్ల ప్రస్తుతం అదే ఎత్తులో రోడ్డు వేస్తే నీటివాటం ఉండదని, ఎత్తు తగ్గించాలని అధికారులను కోరామన్నారు. అంతే తప్ప రోడ్డు పనులకు ఎక్కడా ఆటంకం కలిగించలేదని చెప్పారు. టీడీపీ నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం తనపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

బి.మఠంలో జోరుగా సీసీరోడ్డు పనులు

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠంలోని పాతూరు (స్వామి నివాస వీధి)లో సీసీరోడ్డు పనులు జోరుగా సాగుతున్నాయి. రోడ్డు పనులను ఎంపీపీ వీరనారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సీసీ రోడ్డుకు రూ. 12 లక్షల నిధులు విడుదల చేయడంతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. పాతూరు గ్రామస్తులు సీసీ రోడ్డు కావాలని గత ప్రభుత్వకాలంలో కోరినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి నిధులు విడుదల చేయించడంతో పాతూరు గ్రామస్తుల కల నెరవేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగార్జున నాయుడు, అంబిశెట్టి వెంకటసుబ్బయ్య, శివారెడ్డి, పాలరామిరెడ్డి, సుబ్బయ్య, పాల్గొన్నారు.

కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఏబీవీపీ నాయకులు

పోరుమామిళ్ల : జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, జూలై 28న రాష్ట్ర వ్యాప్త బంద్ జయప్రదం చేయాలని బుధవారం పోరుమామిళ్లలో ఏబీవీపీ ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కడప జిల్లా కన్వీనర్ అభిలాష్ మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజనం అమలు చేయాలని కోరారు. అధ్యాపకుల ఖాళీలు భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఇంటర్ కళాశాలలపై చర్య తీసుకోవాలనిఅనధికార హాస్టళ్లను మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర, బ్రహ్మయ్య, రమణ, అనువీణ తదితరులు పాల్గొన్నారు.

'రాయలసీమ ద్రోహి చంద్రబాబు'

ప్రొద్దుటూరు : టీడీపీ అధినేత చంద్రబాబు రాయలసీమ ద్రోహి అని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో అన్నారు.

శ్రీశైలంలో 841 అడుగులు ఉంటేనే రాయలసీమకు నీళ్లు వస్తాయని తెలిసినా చంద్రబాబు 69 జీఓ తెచ్చారని విమర్శించారు. ఆల్ ఇండియా మెడికల్‌సైన్స్ సెంటర్‌ను అనంతపురం నుంచి మంగళగిరికి తరలించారని, తిరుపతి పద్మావతి మెడికల్ కాలేజీలో రాయలసీమ విద్యార్థినులకు అన్యాయం చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. చంద్రబాబు ఎంతో గొప్పగా చెప్పే కియా ఫ్యాక్టరీలో రాయలసీమవాసులకు 10 శాతం కూడా ఉద్యోగాలు రాలేదని చెప్పారు.

సేవకు సలాం



ప్రభుత్వ పథకాలతో చేయూత..



మాబున్నికి పింఛను అందజేస్తున్న వలంటీరు బాల మౌనిక

ప్రొద్దుటూరు మండలం ఈశ్వరరెడ్డి నగర్ సచివాలయంలో వలంటీరుగా పనిచేసే కంభం బాల మౌనిక తన పరిధిలోని కుటుంబాలకు ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూర్చడంలో కృషి చేస్తోంది. వితంతువు అయిన చాపల మాబున్నికి గత ప్రభుత్వంలో రేషన్ కార్డు లేకపోవడంతో పింఛను మంజూరు కాలేదు. రేషన్‌కార్డు కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీరు బాల మౌనిక మాబున్ని సమస్యను తెలుసుకుని రేషన్ కార్డుకు దరఖాస్తు చేయించింది. రేషన్ కార్డు మంజూరు అయిన తర్వాత ఆమెకు వితంతు పింఛను కూడా ఇప్పించింది. అంతేకాదు మాబున్ని వైఎస్సార్ చేయూత పథకానికి అర్హురాలిగా గుర్తించి ఆ పథకానికి కూడా దరఖాస్తు చేయించడంతో ఏటా ప్రభుత్వం నుంచి మాబున్నికి రూ.18,750 సాయం అందుతోంది.

– ప్రొద్దుటూరు కల్చరల్

వలంటీరు సాయంతో నా కష్టాలు తీరాయి

గత ప్రభుత్వ హయాంలో రేషన్‌కార్డుకోసం, వితంతు పింఛను కోసం ఆఫీసుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగి విసిగిపోయాను. వలంటీరు బాలమౌనిక తానే ఇంటికి వచ్చి నా సమస్య తెలుసుకుంది. రైస్ కార్డు ఇప్పించి ఆ తర్వాత వితంతు పింఛను రావడానికి సాయపడింది. చేయూత పథకానికి దరఖాస్తు చేయించడంతో ఆ సాయం కూడా ప్రభుత్వం నుంచి అందుతోంది. మా వలంటీరు చొరవతో మా కష్టాలు తీరాయి.

- చాపల మాబున్ని, ఈశ్వరరెడ్డి నగర్, ప్రొద్దుటూరు

జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ కోసం హెల్ప్ డెస్కుల ఏర్పాటు



గోపవరం గ్రామ సచివాలయం-1లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పరిధిలోని జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ లే అవుట్‌లో ప్లాట్ల అమ్మకాలకు సంబంధించి అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్యాలయంతోపాటు గోపవరం గ్రామ సచివాలయం-1లో మంగళవారం నుంచి హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. అనుడా ఆధ్వర్యంలో మధ్య తరగతి ప్రజల ఇళ్ల నిర్మాణం కోసం 43.88 ఎకరాల విస్తీర్ణంలో లే అవుట్‌ను తయారు చేశారు. మొత్తం 484 ప్లాట్లు అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఇందులో 5 సెంట్ల ప్లాట్ ధర రూ.25.25 లక్షలు, 4 సెంట్ల ప్లాట్ ధర రూ.21 లక్షలు, 3 సెంట్ల ప్లాట్ ధర రూ.15.75 లక్షలుగా నిర్ణయించారు. మొత్తం వ్యయంలో ముందుగా 10 శాతం డబ్బు చెల్లించి ప్లాట్లు కొనుగోలుదారులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఉన్న ప్లాట్లకు సంబంధించి ఒక ప్లాట్‌కు ఇద్దరు చొప్పున డిపాజిట్ చెల్లించిన తర్వాత లక్కీ డ్రా ద్వారా ప్లాట్లు కేటాయించడం జరుగుతుంది. డ్రాలో ప్లాట్ రాని వారికి డబ్బు తిరిగి చెల్లిస్తారు. ఇప్పటి వరకు దాదాపు 100 మంది ప్లాట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని సంబంధిత అధికారులు తెలిపారు. వివరాలకు 8500854581 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వర్షపునీరు పోయే దారేదీ?



జయరామిరెడ్డి వీధిలో నిలబడిన వర్షపునీరు

పోరుమామిళ్ల : పట్టణంలోని కొన్ని వీధుల్లో వర్షపు నీరు పోయేదారిలేక ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని వీధుల్లో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ ఉండగా, మరికొన్ని వీధుల్లో ఒక వైపే డ్రైనేజీ ఉంది. కొందరు ఇంటి యజమానులు డ్రైనేజీ పూడ్చి వేసి మెట్లు నిర్మించు కోవడం, తమ ఇంటి ముందు స్థలంలో మట్టిపోసి ఎత్తు చేసుకోవడం కారణంగా వాన పడ్డప్పుడు డ్రైనేజీ లేక నీరు రోడ్డుపైనే నిలిచి ఉంటోంది. పోరుమామిళ్లలో నాలుగురోజులుగా జల్లులు పడుతున్నాయి. పెద్ద వాన లేదు. జల్లులకే వీధిలో నీరు నిలచిపోతోంది. అలా రోడ్డుపై నిలబడ్డ నీరు వాన తగ్గినా వారం పది రోజులు ఉండటం వల్ల ఆ బురదనీటిలో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రిళ్లు ఆ నీటిలో నడవటం దుర్భరంగా ఉంది. కేవలం ఒకరిద్దరు ఇంటి యజమానుల నిర్వాహకం వల్ల ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాత పోస్టాఫీసు వీధి, డాక్టర్ జయరామిరెడ్డివీధి, రంపాడు రోడ్, ముస్లింకోట, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఉంది. డ్రైనేజీ బాగు చేస్తే పరిష్కారం లభిస్తుంది.

మణిపూర్ ఉదంతం మానవత్వానికి మాయని మచ్చ



మాట్లాడుతున్న చాంద్‌బాషా

బద్వేలు అర్బన్ : మణిపూర్ మారణకాండ మానవత్వానికే మాయని మచ్చ అని ఆవాజ్ జిల్లా అధ్యక్షుడు పి.చాంద్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక ఆవాజ్ కార్యాలయంలో నిర్వహించిన వివిధ ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా మణిపూర్‌లో అల్లర్లు జరుగుతున్నా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా ఎటువంటి చర్యలు తీసుకోకుండా మౌనం వహించడం దారుణమన్నారు. కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకుని మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండను నిలువరించాలని కోరారు. సమావేశంలో కేవీపీఎస్ పట్టణ అధ్యక్షుడు రాజు, పూలే ఆశయసాధన సమితి చైర్మన్ గురుమూర్తి, బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి వినాయకంరెడ్డి, ఆవాజ్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్తార్, అన్వర్‌బాషా, డివిజన్ కార్యదర్శి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి వారసత్వ సంపద పద్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న హనుమంతరావు

గోపవరం : తెలుగుజాతి గర్వించదగ్గ వారసత్వ సంపద పద్యం అని తెలుగుభాష వికాస ఉద్యమ జిల్లా అధ్యక్షుడు విద్వాన్ డాక్టర్ గానుగపెంటహనుమంతరావు అన్నారు. బుధవారం కవయిత్రిమొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో పద్యకవిత శిక్షణా తరగతులు నిర్వహించడంతో పాటు ప్రసిద్ధమైన పద్యాలను పఠనం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాకవులు, పండితులు అందించిన ఈ అమూల్యమైన సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత, కర్తవ్యం తెలుగువారు అందరిపై ఉందన్నారు. అధికారభాష సంఘానికి జిల్లా కమిటీలు ఏర్పాటు చేసి అన్ని విద్యాసంస్థల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, న్యాయస్థానాల్లో మాతృభాష సంపూర్ణ అమలుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.